# బాండు పేపర్‌తో ఒకడు సున్నం పెట్టిండు..



నాగాపూర్‌లో వేముల ప్రసంగం వింటున్న గ్రామస్తులు



బాల్కొండ/ముప్కాల్, నవంబర్ 27: నాలుగున్నరేండ్ల క్రితం ఒకడు.. తనను గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని లేదంటే రాజీనామా చేస్తానని అన్నం పెట్టే రైతులకు సున్నం పెట్టిండని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బాల్కొండ మండలంలోని నాగాపూర్, బస్సాపూర్, ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి ఆరు గ్యారెంటీలకు హామీ తనదంటూ బాండ్ పేపర్ రాసిచ్చిన నేపథ్యంలో వేముల కీలక వ్యాఖ్యలు చేశారు. ఆనాడు బీజేపీ నాయకుడు బాండ్ పేపర్‌తో రైతులకు సున్నం పెడితే .. ఇప్పుడు కాంగ్రెసోడు మళ్లీ ప్రజలకు సున్నం పెట్టేందుకు బాండు పేపర్ పట్టుకుని బయల్దేరాడని ధ్వజమెత్తారు. కర్ణాటకలో ఇలాంటి హామీలిచ్చి అమలుకు సాధ్యం కాక చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ ఇక్కడ మాత్రం అది చేస్తామని ఏవేవో అలవికాని హామీలతో ప్రజలను మోసం చేస్తుందని అక్కడి పరిస్థితులను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. తాను బాల్కొం డ నియోజకవర్గానికి మరింత మంచి చేస్తానన్నా రు. ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్‌కే క్లారిటీ లేదని ఎద్దేవా చేశారు. అంతా డొంక తిరుగుడు మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ఆలోచనే తప్ప వారు అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదన్నారు. నాగంపేట్‌లో రూ.28 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో 427 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. బాల్కొండను అన్ని విధాలా అభివృద్ధి చేసిన తనను, కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కారు గుర్తుకు ఓటేయాలని విన్నవించారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బాల్కొండ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, జడ్పీటీసీ లావణ్య, నాగపూర్ సర్పంచ్ లింబాద్రి, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఇప్పుడు ఇంకొకడు సున్నం పెట్టేందుకు రెడీ అయ్యిండు..
- బీజేపోడు నాలుగున్నరేండ్ల కింద ప్రజలను మోసం చేసిండు..
- ఇప్పుడు కాంగ్రెసోడు బయల్దేరిండు..
- రైతుబంధు, రుణమాఫీ ఆపింది కాంగ్రెస్ వాళ్లే
- ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ పార్టీకే క్లారిటీ లేదు..
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో ఎన్నికల ప్రచారం



నాగాపూర్‌లో బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



నాగంపేట్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న వేముల



నాగంపేట్‌లో వేములను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

# గ్రామ గ్రామాన బీఆర్‌ఎస్ జోరుగా ప్రచారం



భీమ్‌గల్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, బీఆర్‌ఎస్ నాయకులు



వేల్పూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న యువకులు

వేల్పూర్/ కమ్మర్‌పల్లి/ మోర్తాడ్/బాల్కొండ/ముప్కాల్, నవంబర్ 27 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం వే ల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించారు. కా రు గుర్తుకు ఓటువేసి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కమ్మర్‌పల్లి మండలంలో బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచార కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నది. సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి ప్రచారం చేశారు. కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అం దించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

మోర్తాడ్ మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియాలు విస్తృత ప్రచారం చేశారు. మోర్తాడ్ కేంద్రంగా బీడీ కార్మికులకు పింఛన్లు ఇప్పించి, రాబోవు రోజుల్లో కటాఫ్ లేకుండా బీడీకార్మికులందరికీ పింఛన్లు ఇచ్చేలా చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీటీసీ రాజ్‌పాల్, సదన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. తాళ్లరాంపూర్ సర్పంచ్ భీమనాతి భానుప్రసాద్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామల్లో సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన వేములప్రశాంత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ముప్కాల్ మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి వేములను గెలిపించాలని కోరుతున్నారు.

భీమ్‌గల్ మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని ఒకటో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు.ఒకటో వార్డులో మిగిలిన అభివృద్ధి పనులను వేముల సహకారంతో పూర్తి చేయించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. భీమ్‌గల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు.



మోర్తాడ్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కమ్మర్‌పల్లిలో..



తాళ్లరాంపూర్‌లో..

## మంత్రి సతీమణి ఇంటింటా ప్రచారం



బాల్కొండలో ప్రచారం నిర్వహిస్తున్న వేముల సతీమణి నీరజారెడ్డి

బాల్కొండ, నవంబర్ 27 : బాల్కొండ మండల కేంద్రంలో సోమవారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి వేముల నీరజారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆర్మూర్ గల్లీ, నడిమి గల్లీ కాలనీ, పోచమ్మ గల్లీ, కుమ్మరి గల్లీ, అంబేద్కర్ నగర్ కాలనీలో గడపగడపకూ తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టో, ప్రచార పత్రాలను అందించారు. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.